క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మకరజ్యోతి దర్శనం


మార్కాపురంలో ప్రత్యేక తెరపై మకర జ్యోతిని వీక్షిస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. సోమవారం రాత్రి మకరజ్యోతి దర్శనాన్ని ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెరపై వీక్షించారధ్యాలయ కమిటీ అధ్యక్ష్య కార్యదర్శులు టీజీ మల్లికార్జున రావు, పర్సూరి కృష్ణయ్య, కోశాధికారి మోహన్‌రావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పారువేట మహోత్సవం

గిద్దలూరు రూరల్: సంక్రాంతి, కనుమ సందర్భంగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి ఆలయంలో పారువేట మహోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సీతా రాముల,లక్ష్మణ, హనుమంత సమేత ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అర్చకస్వాములు పంపిణీ చేశారు.

ఘనంగా ఆర్మీ డే


పాండురంగస్వామిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్: మండలంలోని మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్లో సోమవారం ఆర్మీ డేను పురస్కరించుకుని మాజీ సైనిక ఉద్యోగి, తెలుగు ఉపాధ్యాయుడు ఎ.పాండు రంగస్వామిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పి.మురళి, సుధాకర్ తదితరులు మాట్లాడుతూ.. 2017 వరకు భారత సైన్యంలో, అంతకు ముందు రెండేళ్లు యునైటెడ్ నేషన్స్ శాంతి దళంలో భాగంగా కాంగో దేశంలో విధులు నిర్వర్తించిన పాండురంగస్వామి 2018 డీఎస్సీలో తెలుగు ఉపాధ్యాయునిగా ఎంపికై మోడల్ స్కూల్లో సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పుతూ ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుజాత, షకీలా భాను, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని రైస్ మిల్ ఆవరణలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొంటారని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, గృహసారథులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ వెంకటయ్య, జెడ్పీటీసీ వాగ్యానాయక్, మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, సర్పంచ్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి సంబరాలను పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో చిన్నారులు, యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. సోమ, మంగళవారాల్లో పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.


పొదిలిలో పతంగుల పోటీకి సిద్ధంగా ఉన్న యువత


తర్లుపాడులో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు


పందిళ్లపల్లెలో రసవత్తరంగా కోలాటం

మార్కాపురం రూరల్: మండలంలోని దరిమడుగు గ్రామంలో బట్టగిరి శివారెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్, కర్రాబిళ్ల పోటీలు నిర్వహించారు. క్రికెట్‌లో విజేతగా నిలిచిన ఐకాన్ లెవెన్ జట్టుకు మొదటి బహుమతి రూ.10,116ను దరిమడుగు సర్పంచ్ బి.గౌతమిగోపాల్‌రెడ్డి, ద్వితీయ బహుమతి రూ.5,116ను జై శ్రీరామ్ టీమ్‌కు జార్జి కళాశాల రామాంజనేయులు అందజేశారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఆల్‌రౌండర్‌కు రూ.2,116ను అశోక్‌రెడ్డి అందించారు. కర్రాబిళ్ల పోటీలో గెలుపొందిన వారికి రూ.3,116ను మల్లికార్జునరెడ్డి అందజేశారు.

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని కంబాలపాడు అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ ఆకృతులు చూపరులను ఆకట్టుకున్నాయి. మహిళలకు ముగ్గుల పోటీ, యువకులకు బైక్ పోటీలు నిర్వహించారు. రామాపురంలో, పొదిలి పట్టణంలో రాజన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన రంగువల్లుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ కె.నరసింహారావు, రాజన్న చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బీరం రాజమోహన్‌రెడ్డి, నారాయణ,ఎమల్లాపురం నరసింహులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పతంగుల పోటీలు

పొదిలి–దర్శి రోడ్డులోని ఆర్టీసీ బస్ సెల్టర్ మైదానంలో మంగళవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పతంగుల పోటీలు నిర్వహించారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 35 మంది చొప్పున పాల్గొనగా విజేతలకు బహుమతులు అందించారు. వాసవి క్లబ్ సభ్యులు మువ్వల పార్థు, సాధు వెంకట ప్రవీణ్, పందిటి వరలక్ష్మి, సోమిశెట్టి, శ్రీనివాసులు, గుడిపాటి ప్రసాదు, కొలిపకుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ముగ్గుల పోటీలు

తర్లుపాడు: మకర సంక్రాంతిని పురస్కరించుకుని తర్లుపాడులో పోలేరమ్మ దేవస్థానం యూత్, నెహ్రూ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, శ్లోకాలు, గీతాలాపన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి దంపతులు హాజరయ్యారు. విజేతలకు వాసవీక్లబ్, సంతూర్ సోప్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల స్వామి ఆలయ ధర్మకర్త విజయభాస్కర్‌రావు, కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ కృష్ణప్రసాద్, ఎల్‌ఐసీ డీఓ శివకుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కశ్శెట్టి జగన్‌బాబు, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని సంక్రాంతి సంబరాలు మూడు రోజులుగా వైభవంగా నిర్వహించారు. పందిళ్లపల్లె, మోక్షగుండంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలకు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు, యూత్‌కు ఆటల పోటీలు, కోలాటం, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. మంగళవారం కనుమ సందర్భంగా పార్వేట నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామం చివరకు పార్వేటకు తీసుకొచ్చారు. జిమ్మిచెట్టు చుట్టూ ప్రదక్షణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆనందోత్సవాలతో పెద్దలు, చిన్నారులు అధిక సంఖ్యలో పార్వేట కార్యక్రమంలో పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక అడ్డరోడ్డులో వెలసిన శ్రీ విజయాంజనేయ స్వామి ఆలయంలో మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం ముగ్గుల పోటీలు ఆలయ ధర్మకర్త శిరిగిరెడ్డి బాలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 90 మంది మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. దండెబోయిన స్వప్న ప్రథమ, నిమ్మకాయల ఐశ్వర్య ద్వితీయ, ఐలూరి భావనరెడ్డి తృతీయ విజేతలుగా నిలిచారు. వారికి గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

ముండ్లమూరు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతిగా చేసుకోవడం ఆనవాయితీ. కుల మతాలకు అతీతంగా సంక్రాంతి పండగను అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకుంటారు. ఆ రోజున తమ పూర్వీకులకు, పెద్దలకు నూతన వస్త్రాలు బహుకరించడంతో మంచి జరుగుతుందని ప్రజల విశ్వాసం. మహిళలు, యువకులు ఉదయాన్నే లేచి లోగిళ్లను రంగవల్లులతో అలంకిరంచారు. తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జమ్మలమడక, వేంపాడు, పసుపుగల్లు, ఉల్లగలు, భట్లపల్లి గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముండ్లమూరు, రమణారెడ్డిపాలెం గ్రామాల్లో కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కర్పూర జ్యోతి

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా 27 కిలోల కర్పూర జ్యోతిని వెలిగించారు. అయ్యప్పస్వామి మాలధారణస్వాములు, భక్తులు ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి 18 మెట్లను పూలతో అలంకరించి జ్యోతి అనంతరం స్వామి వారికి పాలాభిషేకం, పూలాభిషేకం నిర్వహించారు. భక్తులు భక్తిపాటలు పాడి భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

తాళ్లూరు (ముండ్లమూరు): సంక్రాంతి పండగ సందర్భంగా మండల ప్రజలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని బొద్దికూరపాడులో సంక్రాంతి సందర్భంగా శ్రీదేవి భూదేవి శ్రీమాధవ స్వామి వారిని గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పులి అంజిరెడ్డి, ఉప సర్పంచ్ పులి ప్రసాదరెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సంగన యోగిరెడ్డి, పులి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.


దరిమడుగులో విజేతలకు బహుమతులు


కంభాలపాడులో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు


దొనకొండ: విజేతలకు బహుమతులు పంపిణీ


కురిచేడులో వెలుగుతున్న 27 కిలోల కర్పూర జ్యోతి

800 మందికి దుప్పట్లు పంపిణీ

మార్కాపురం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా మందిరంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మందిరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 800 మంది పేదలు, దివ్యాంగులకు దుప్పట్లు, దుస్తులు అందించారు. ఏటా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందజేసినట్లు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎస్ఆర్‌సీ లాబొరేటరీస్ ఎండీ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, పలువురు ప్రముఖులు సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు. వందల సంఖ్యలో భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు, యువసేవ సమాజ్ అధ్యక్ష్య కార్యదర్శులు కృష్ణమోహన్, కరీం, రామడుగు గోపి, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు అందిస్తున్న జంకె వెంకటరెడ్డి

రహదారి గుంతలు పూడ్చించిన తాటిపర్తి

పెద్దారవీడు: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచర్ల గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జితాటిపర్తి చంద్రశేఖర్ సొంత నిధులతో మంగళవారం పూడ్చించారు. మార్కాపురం నుంచి గుండంచర్ల గ్రామం వరకు నిత్యం ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గ్రామాలకు వెళ్లే కొండపై రహదారి మూలమలుపుల వద్ద వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సుంకేసుల, కలనూతల సర్పంచ్‌లు గుడ్డెపోగు రమేష్, భూలక్ష్మి, గ్రామాల ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి జేసీబీ సాయంతో గుంతలకు మట్టి తోలించాలని సర్పంచులకు తెలిపారు. ప్రజల సమస్యలపై స్పందిస్తున్న నూతన ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తాటిపర్తి చంద్రశేఖర్ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎప్పటికీ ముందుంటారని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సాఫీగా ప్రయాణం చేసేలా రహదారి గుంతలు పూడ్చించిన తాటిపర్తి చంద్రశేఖర్‌కు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.


గుంతలకు మట్టి వేస్తున్న జేసీబీ

నేడు వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల సమావేశం

కురిచేడు: నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు దర్శిలోని బూచేపల్లి నిలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, రాష్ట్ర డైరెక్టర్లు, కౌన్సిలర్‌లు, అన్ని గ్రామాల ముఖ్య నాయకులు పాల్గొనాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పేకాట స్థావరంపై దాడి.. ఎనిమిది మంది అరెస్టు

కొమరోలు: పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసిన సంఘటన మండలంలోని హసనాపురంలో మంగళవారం జరిగింది. హసనాపురం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో 8 మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఎ.సుబ్బరాజు ఆధ్వర్యంలో తమ సిబ్బంది దాడులు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 7610 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నలుగురు జూదరుల అరెస్టు

ముండ్లమూరు: మండలంలోని బొప్పూడివారిపాలెంలో పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ యూవీ కృష్ణయ్య తెలిపారు. మంగళవారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 3730 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మారెళ్ల గ్రామానికి చెందిన గురునాథానికి గాయాలయ్యాయి. సోమవారం గురునాథం ద్విచక్ర వాహనంపై అద్దంకి నుంచి స్వగ్రామం మారెళ్ల వస్తుండగా మార్గంమధ్యలో నూజిళ్లపల్లి–శంకరాపురం మధ్యలో ఎదురుగా వస్తున్న మూడు చక్రాల ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న గురునాథానికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం స్వాధీనం

గిద్దలూరు రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన 88 మద్యం బాటిళ్లను స్థానిక ఎస్‌ఐ మహేష్ స్వాధీనం చేసుకుని విక్రయించే వ్యక్తిని అరెస్ట్ చేసిన సంఘటన మంగళవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని అంకణాంపల్లె గ్రామానికి చెందిన మోడిగారి శ్రీరాములు అనే వ్యక్తి అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ముండ్లమూరు: మండలంలోని వేంపాడులో అక్రమంగా మద్యం అమ్ముతున్న గండి సుబ్బయ్యను అదుపులోకి తీసుకొని అతని నుంచి 25 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యూవీ కృష్ణయ్య తెలిపారు. సోమవారం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా గండి సుబ్బయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటా

● వై.పాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్


ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. త్రిపురాంతకం మండలం లేళ్లపల్లిలో అగ్ని ప్రమాద బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని, ప్రభుత్వపరంగా రావాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందే విధంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తక్షణ సహాయం కింద ఆయన 3 గృహాల వారికి రూ. 15 వేలు ప్రకారం, ఒక గృహాదారుడికి రూ.20 వేలు, అగ్ని ప్రమాదంలో బూడిదయిన గడ్డివామి యజమానికి రూ.10 వేలు ప్రకారం ఆయన తన సొంత డబ్బులు అందించారు. రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ దుగ్గెంపూడి వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ చల్లా ఎల్లారెడ్డి, మహిళా విభాగం జిల్లా సహాయ కార్యదర్శి సరళ, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాలరెడ్డి, ఎంపీటీసీలు చిన్నకొండు పేరిరెడ్డి, ఎస్.సబ్బారావు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన వద్దే వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు గూడా ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు మంగళవారం నమోదు చేసినట్లు ఎస్‌ఐ వైవీ రమణయ్య తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలోని దోసకాయలపాడులో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన కోలాటం కార్యక్రమానికి బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన వద్దే వేణుగోపాల్, గూడా ప్రభాకర్‌రెడ్డిలు వేర్వేరుగా వెళ్లారు. కోలాటం చూస్తుండగా ఇద్దరి మధ్య గొడవ జరగడంతో వేణుగోపాల్‌ను కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టడంతో మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వేణుగోపాల్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.